క్లుప్తంగా

140 కొత్త పింఛన్ల మంజూరు

పుల్లంపేట : మండలానికి కొత్తగా 140 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ఈ కొత్త పింఛన్లు ఆయా సచివాలయాలలో అర్హులైన వారికి అందించారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, బోగా పార్థసారథిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతో పింఛన్ అందుకున్న వృద్ధులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

గాలివీడు ఉప సర్పంచ్‌గా తంగాల వెంకటరత్నం



ధృవీకరణపత్రాన్ని అందుకుంటున్న వెంకటరత్నం

గాలివీడు : గాలివీడు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్‌గా తంగాల వెంకటరత్నంను గ్రామ సచివాలయంలో సర్పంచ్ మిట్టపల్లె లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన వార్డు సభ్యులు సోమవారం ఎన్నుకున్నారు. వెంకటరత్నం తండ్రి తంగాల వెంకటేశ్వర్లు ఉప సర్పంచ్‌గా ఉంటూ కరోనా సమయంలో మృతి చెందడంతో ఆయన స్థానంలో వెంకటరత్నంను ఎన్నిక చేశారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన వెంకటరత్నం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో కలెక్టర్, ఎస్పీలకు అర్జీలు సమర్పించేందుకు వచ్చే అర్జీదారులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. గత 35 వారాలుగా ప్రతి సోమవారం రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గాలివీడు : మండల పరిధిలోని గరుగుపల్లె గ్రామంలో వెలసిన ఎల్లమ్మ తల్లి దేవస్థానానికి గ్రామ పెద్దలు భానుచంద్ర, భాస్కర్, వేద పండితుల ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం భూమిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో టీటీడీ నిధులు రూ.10 లక్షలు, దాతల సహకరంతో సమకూరిన రూ.20లక్షలతో గ్రామస్తులు ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకేపాటి సేవలు ఆదర్శం



కంటి శిబిరానికి వచ్చిన వారితో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఏపీపీఎస్సీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

రాజంపేట రూరల్ : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డికి ఉన్న సేవాతత్పరత అపూర్వమని ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్ సుధాకర్‌రెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ఆధ్వర్యంలో వల్లూరు రమేష్‌రెడ్డి సహకారంతో శంకర నేత్రాలయం వారు నిర్వహిస్తున్న కంటి పరీక్షలు సోమవారం 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ కంటి వైద్య శిబిరాన్ని ఏపీపీఎస్సీ బోర్డు మెంబర్ సుధాకర్‌రెడ్డి సందర్శించారు. అదే విధంగా ఆపరేషన్‌లు నిర్వహించుకున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకేపాటి సేవలు అందరికి ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, శంకర నేత్రాలయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచండి

పెనగలూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి ఎంఈఓలకు సూచించారు. సోమవారం మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో నూతన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎం. గిరివరదయ్య మర్యాదపూర్వకంగా వైస్ ఎంపీపీని కలిసి సత్కరించారు. గ్రామాలలో డ్రాపౌట్స్ లేకుండా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు శశికళ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిని ప్రోత్సహించండి

రాయచోటి టౌన్ : సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఉత్పత్తులను మార్కెట్ చేసుకొనే విధంగా రైతులను ప్రోత్సహించాలని డీపీఎం రామకృష్ణ కూరగాయల విక్రయ (స్టాల్) నిర్వాహకులకు సూచించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేసిన పంటలను అక్కడ అమ్ముకొనే విధంగా జిల్లా కలెక్టర్ అనుమతిచ్చారన్నారు. దీంతో ఇప్పటి వరకు 1.24 టన్నుల కూరగాయలు విక్రయించామన్నారు.

సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకే సేవలు

- గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం ప్రారంభం
- బి.యర్రగుడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

లక్కిరెడ్డిపల్లె : అభివృద్ధి సోపానాలుగా గ్రామ సచివాలయాలు నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బి.యర్రగుడి గ్రామ సచివాలయ నూతన భవన ప్రారంభంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, సింగల్ విండో అధ్యక్షుడు ఎర్రంరెడ్డి, సర్పంచ్ రెడ్డయ్య, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ గదులను శ్రీకాంత్ రెడ్డి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ప్రజల ముంగిటకే సేవలు అందిస్తూ భరోసానిస్తున్నాయన్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నిర్దేశిత సమయం కన్నా ముందుగానే ప్రజలకు సేవలు అందుతున్నాయన్నారు. సచివాలయాలలో జవాబుదారితనం, పారదర్శకంగా సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిద్దక రామచంద్రారెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఎంపీటీసీలు పోలిరెడ్డి సుబ్బారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, సుబ్బరాయుడు, సర్పంచ్‌లు రెడ్డయ్య, జనార్దన్ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, రమణయ్య, మహేంద్ర బాబు, మాజీ ఎంపీటీసీలు రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్ రెడ్డి, రామచంద్రయ్య, విజయభాస్కర్ రెడ్డి, మల్ రెడ్డి, నాగముని, వేమిరెడ్డి రాజారెడ్డి, మహమ్మద్ రఫీ, నాయకులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బి.యర్రగుడి గ్రామంలో స్థానిక ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎర్రంరెడ్డి, సర్పంచ్ రెడ్డయ్య, ఎంపీటీసీ లక్ష్మీనారాయణలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని బీసీ నాగిరెడ్డిపల్లె, బి యర్రగుడి కస్బా, కాపుపల్లె, ఎస్సీ కాలనీ, చెంచర్లపల్లె, ఎస్సీ కాలనీ, మూడిండ్లపల్లె, నల్లగుట్టపల్లె, పుటట్కాలవాండ్లపల్లె, కాలనీలలో ప్రతి గడపకు ఆయన వెళ్లి ప్రజా సమస్యలు ఆరా తీయడంతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని సత్వర పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేర్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. పేదలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. మరింతా మెరుగ్గా పాలన అందిస్తామని, ఇందుకు ప్రజల సహకారం, సూచనలు, సలహాలు ఇవ్వాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

లక్కిరెడ్డిపల్లె : రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మండలంలోని కోనంపేట పీహెచ్‌సీ భవన ప్రారంభంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రిలోని గదులు, వసతి సౌకర్యాలను ఆయన పరిశీలించారు. సొంత మనుషుల్లా భావించి సేవలు అందించి ప్రజల మన్ననలను పొందాలని వైద్యాధికారులకు, సిబ్బందికి శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేయడమే కాక ఇంటింటికి వైద్యుడిని పంపి ఆరోగ్య విషయాలను పర్యవేక్షిస్తోందన్నారు. ఇలాంటి మునుపెన్నడూ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, వైద్య సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు ఆర్థిక భరోసా

జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతుకు భద్రత, ఆర్థిక భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని బి.యర్రగుడి గ్రామం మూడిండ్లపల్లెలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపిపి అంబాబత్తిన రెడ్డయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు యర్రమరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, నాయకులతో కలిసి జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు మంచి ధరలు లభిస్తాయన్నారు. ప్రైవేటు డెయిరీల అడ్డగోలు దోపిడీకి కళ్లెం వేస్తూ సీజన్‌తో సంబంధం లేకుండా ఎస్ఎన్ఎఫ్, వెన్నశాతం ప్రామాణికంగా అన్ని సీజన్లలోనూ ఒకే రీతిలో చెల్లింపులు చేస్తున్నారన్నారు.

రెండు రోజులపాటు ఎస్జీఎఫ్ గేమ్స్

రామాపురం : 2023 – 24 సంవత్సరానికి సంబంధించి మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7, 8వ తేదీలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీ, పీడీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బాడ్మింటన్ జరుపనున్నామన్నారు. 8న త్రోబాల్, టెన్నికాయిట్ షటిల్, యోగ, అథ్లెటిక్స్ ఆటలను నిర్వహిస్తామన్నారు.

ఎర్రచందనం, ఇసుక అక్రమాలపై నిఘా



రికార్డులను పరిశీలిస్తున్న కడప డీఎస్పీ షరీఫ్

సిద్దవటం : నిఘా వ్యవస్థను బలోపేతం చేసి ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణాను జరుగకుండా నిరోధించాలని పోలీసులకు కడప డీఎస్పీ షరీఫ్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే బాధితులు పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు చేస్తే సదరు ఫిర్యాదులపై వెంటనే విచారించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీసులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లి (రాయచోటి టౌన్) : ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి కావాల్సిన అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సకాలంలో వానలు కురవకపోవడంతో గ్రామాలలో తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని దీనిని అధిగమించడానికి స్కీం బోర్లను మరమ్మతులు చేయాలని సూచించారు. అలాగే ఈ ఏడాది వానలు కురవకపోవడంతో రైతులు పంటలను కూడా సాగు చేయలేదని అక్కడక్కడా సాగు చేసిన పంటలను పరిశీలించాలని చెప్పారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో ఎవరైనా అర్హత ఉండి అందకపోతే వెంటనే అలాంటి వారిని గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందే విధంగా అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. అలాగే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాలు అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. మట్లి సర్పంచ్ నాగార్జునాచారి మాట్లాడుతూ గతంలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి జేజేఎం నిధుల ద్వారా స్కీం బోర్లు వేశామని కానీ వాటికి ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరారు. సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు మాట్లాడుతూ వీరబల్లె మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, జెడ్పీటీసీ శివరాంగౌడ్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంత రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి తహసీల్దార్ పుల్లారెడ్డిని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో సాయికిషోర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూములు సర్వే, పట్టాల సమస్యలు, ఆన్‌లైన్ సమస్యలను క్షేత్రస్థాయిలో సిబ్బందితో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆన్‌లైన్ తప్పనిసరి కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పరిష్కరించాలన్నారు. ఇందుకు తహసీల్దార్ పుల్లారెడ్డి స్పందిస్తూ రైతుల అర్జీలను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. అలానే చిన్నఓరంపాడు జ్ఞానంపల్లె దళితవాడ ప్రజలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఐ నాయకులు గ్రామ ప్రజలు తహసీల్దర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామ్మోహన్‌నాయుడు, ఎంపీటీసీ పైడి గిరినాయుడు, సర్పంచ్ పోలి పాపిరెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి, మారే సుకుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుపుదాం

చిన్నమండెం : చిన్నమండెం మండలాన్ని ప్రకృతి వ్యవసాయ విధానం అమలులో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ శాఖ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ(ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణరాజు మాట్లాడుతూ డ్వాక్రా మహిళా సంఘాలతో కలిసి పనిచేయాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నటువంటి రైతులకు పంట నమోదును చేయించాలన్నారు. ప్రతి రైతు కనీసం 20 సెంట్లు ఏటీఎం మోడల్ వేసి ప్రతి రోజు ఆదాయం పొందాలని, అందుకు అనుగుణంగా సిబ్బంది అందరూ గ్రామ స్థాయిలో రైతులను రసాయన వ్యవసాయం నుంచి ప్రకృతి వ్యవసాయంలోకి మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రెడ్డమ్మ, మండల లీడ్ చందురెడ్డి, మండల పాయింట్ పర్సన్ సుబ్రమణ్యం ఆచారి, ఎన్ఎఫ్ఏ మానస, జిల్లా ఎన్ఎఫ్ఏలు యశోధ, అపర్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవతో మానసిక ప్రశాంతత



అరుంధతివాడ ప్రజలకు విరాళాన్ని అందిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట అరుంధతివాడలోని మాతమ్మ గుడికి సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి రూ.1,10,116లను ఆ గ్రామస్తులకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా కాదనకుండా తనవంతు సహాయం చేయడంలో ముందుంటానని ఆయన అన్నారు. గ్రామాలలో దేవాలయాలు ఉండటం వలన ఆధ్యాత్మిక సేవలో తరించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బండారు మల్లికార్జున, రమణారెడ్డి, హరిక్రిష్ణారెడ్డి, మల్లు క్రిష్ణారెడ్డి, బత్తల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అలానే మరో కార్యక్రమంలో రైల్వేకోడూరుకు చెందిన చైతన్య ప్రసాద్, శివాజి బాలికల విభాగంలో క్రిష్ణవేణిలు అక్టోబర్ నెలలో అసోంలో జరగబోయే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ప్రత్యేకంగా అభినందించి వారికి రూ.15వేల రుపాయలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కోచ్ శివాజి, బండారు మల్లి, రమణారెడ్డి , క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం



కళ్యాణం నిర్వహించిన వేద పండితులు

సిద్దవటం : లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో సోమవారం శివ, పార్వతుల ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని మండలంలోని ఎస్. రాజంపేట గ్రామానికి చెందిన నంద్యాల విజయలక్ష్మి, క్రిష్ణయ్య, వెంకటరమణ, సుజాత దంపతులు నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణం జరిగింది. దేవాదాయశాఖ అధికారులు స్వామి వారి లడ్డూను బహిరంగ వేలం వేయగా వైఎస్ఆర్‌సీపీ నేత వెంకటరమణారెడ్డి రూ. 10 వేలకు దక్కించుకున్నారు.

నేడు స్వామిత్వ ప్రాపర్టీ కార్డుల పంపిణీ

రామాపురం : నేడు మండలంలోని గువ్వలచెరువులో స్వామిత్వ ప్రాపర్టీ కార్డులను మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ హైదర్‌వలి, ఈఓపీఆర్డీ ఉషారాణిలు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ ఉదయం 10.30గంటలకు స్వామిత్వ ప్రాపర్టీ కార్డులను 996 మంది లబ్ధిదారులకు అందిస్తామన్నారు. అలానే మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు మండల శాఖ అధికారులు హాజరుకావాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకాని అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు.

ధరల స్థిరీకరణకు బడ్జెట్‌ను కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం బయట నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

రాయచోటి అర్బన్ : ధరల స్థిరీకరణకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా ధర్నాను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు షరతులను కేంద్రం అమలు చేస్తూ రాష్ట్రాలపైనా బలవంతంగా రుద్దుతోందన్నారు. దీంతో సామాన్యులపై మోయలేని భారాలు పడుతున్నాయన్నారు. విద్యుత్ చార్జీల భారంతో పరిశ్రమలు మూతబడుతున్నాయన్నారు. ఇదిచాలదన్నట్లుగా వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌మోటార్లను బిగించేందుకు సిద్ధమవుతుండడం దారుణమని మండిపడ్డారు. నిరుద్యోగ నివారణకు కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు తగుచర్యలు తీసుకోవాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగబసిరెడ్డి, ఫయాజ్, ఓబులేసు, గంగయ్య, అనిల్, మాధవి, రెడ్డెయ్యలతోపాటు పలువురు ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



రామాపురం: పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన

రామాపురం : పౌష్టికాహారం కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామం సెక్టార్ పరిధిలోని కొత్తపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషణ్ వారోత్సవాల వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న వైఎస్సార్ కిట్లలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకొని రక్తహీనత నివారించుకోవాలన్నారు. స్థానికంగా దొరికే కూరగాయలు, ఆకుకూరలతో పోషక ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చునన్నారు. గర్భిణులు గుడ్లను తినాలని, పౌషకాహారం కలిగిన పదార్థాలను, ఐరన్, కాల్షియం మందులను వాడాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు సుబాషిణి, పార్వతి, రమాదేవి, ప్రసన్న ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

పెనగలూరు : పౌష్టికాహార మాసోత్సవాలను మండలంలో విజయవంతంగా నిర్వహించాలని సీడీపీఓ రాజేశ్వరి అన్నారు. గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు, సిబ్బందితో కట్టావారిపల్లెలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సెప్టెంబర్ మాసాన్ని పౌష్టికాహార మాసోత్సవంగా చేసిందన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో ఈ వారోత్సవాలు నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు రక్తహీనతకు గురికాకుండా ఎటువంటి ఆహారం తీసుకోవాలో ఆమె వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖారాణి, ఉపాధ్యాయులు శేషఫణి, రఫీ, సర్పంచ్ మోహనమ్మ, పంచాయతీ కార్యదర్శి వసంత, ఏఎన్ఎం ఎల్లమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బంజారాల సంస్కృతికి ప్రతీక ‘తీజ్’



మొలకెత్తిన గోధుమ నారు బుట్టలకు పూజలు చేస్తున్న బంజారాలు

రాయచోటి అర్బన్ : ఈనెల 7వ తేదీన రాయచోటిలో జరిగే బంజారా తీజ్ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథనాయక్, తీజ్ ఉత్సవకమిటీ నేతలు దాడి క్రిష్ణనాయక్, మూడే శంకర్‌నాయక్‌లు కోరారు. సోమవారం స్థానిక సాయిబాబా ఆలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొట్టమొదటిసారి బంజారా తీజ్ ఉత్సవాలు సాంప్రదాయాలు, నృత్యాలతో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పండుగ బంజారాల సంస్కృతికి ప్రతీక అన్నారు. 9 రోజులపాటు ఈ వేడుక జరుగుతుందన్నారు. 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఎస్ఎన్ కాలనీలో ఉండే సాయిబాబా గుడి దగ్గర నుంచి బస్టాండు సర్కిల్ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. బంజారా ఆడబిడ్డలు బుట్టలుపెట్టి గోధుమ విత్తనాలు చల్లి 9రోజులపాటు నీరుపోసి నారుపెంచి మొక్కుతారన్నారు. ఉత్సవానికి బంజారాలందరూ తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

రామాపురం : మండలంలోని రాచపల్లి, బండపల్లి, గోపగుడిపల్లి గ్రామాల్లో సోమవారం 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం కూలీలు చేసిన పనులకు సంబంధించి సామాజిక బృందం ఆయా గ్రామాల సచివాలయంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాచపల్లి గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులు 303 పనులకు రూ. 2,37,90,374లు ఖర్చు చేశామన్నారు. గ్రామంలో మొత్తం 1,300 జాబ్‌కార్డులు ఉండగా అందులో పని చేసిన కూలీలు 1,100 మంది కూలీలు పనులు చేశారన్నారు. ఈ గ్రామంలో ఉపాధి పనులతో పాటు హౌసింగ్, హార్టికల్చర్ చేపట్టిన పనులపై సామాజిక బృందం రికార్డును పరిశీలించారు. బండపల్లి గ్రామంలో 23 పనులు సంబంధించి రూ. 40.05లక్షలు ఖర్చు అయ్యిందన్నారు. అనంతరం అధికారులు పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో మొత్తం 463 జాబ్‌కార్డుకు సంబంధించిన రికార్డులను కూడా తనిఖీ బృందం పరిశీలించారు. గోపగుడిపల్లి గ్రామంలో 84 పనులు సంబంధించి రూ. 40లక్షలు వరకు ఉపాధి పథకం పనులు చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను గ్రామ సచివాయలంలో ఉపాధి కూలీలతో సమావేశంలో సామాజిక బృందం తనిఖీ చేసింది. కార్యక్రమంలో అధికారులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సర్వేను పూర్తి చేయాలి



సర్వే వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీధర్ రావు

పెనగలూరు : ఓటర్ల జాబితాను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. సోమవారం రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పూర్తై, చనిపోయిన వారు, షిఫ్టింగ్‌లకు సంబంధించి 750 పేర్లు మండలంలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై వెంటనే సర్వే పూర్తిచేయాలన్నారు.